

# అనుకోని సంఘటన

రచన : ఆర్. హెచ్. బాబు

ఇన్నారా బాబు, రమణయ్యగా రబ్బాయి మేనరికం చేసుకోనని తెగేసి చెప్పేశాట్ట'

స్థానిక వార్తాపత్రిక మంగలిరామన్న క్షురకర్మ సాగిస్తూ ప్రసారము చేసిన తాజావార్త చెవినిబడేసరికి చంద్రశేఖరం ఉలికిపడ్డాడు. మంగలి రామన్న కాస్త జాగ్రత్తగా వుండబట్టి సరిపోయిందికాని లేకపోతే అతగాడి చేతికత్తి దాదాపు అరంగుళం మేరకు చంద్రశేఖరం గడ్డంలో దిగబడి రక్తం చవిచూచి వుండేదే.

"ఏఁవిటీ నిజంగానా? చంద్రశేఖరం ఆశ్చర్యంగా నోరు తెరిచాడు. డబ్బు మానవుడిచేత ఎన్నికూళ్లు కుడిపిస్తుంది? ఎన్ని అబద్ధా లాడిస్తుంది?

కట్నాలూ కానుకలూ ఇవ్వగలిగి వుంటే అన్నపూర్ణమ్మ కూతురి పెళ్ళి కోసం యింతగా బెంగపడాలిసిన అవసరమేమి?

"ఇంతకీ పాపం! శశిరేఖ అభాగ్యురాలు!" చంద్రశేఖరం బాధగా నిట్టూర్చాడు.

శశిరేఖ పుట్టినపుడే భానుమూర్తి పేరు పెట్టారు. బాల్యంలో శశిరేఖా-భానుమూర్తీ బొమ్మరిల్లు కట్టుకొని ఆడుకుంటోంటే—

"చూచావా బావా? వాళ్ళిద్దరూ ఆడుకుంటోంటే ఎంత ముచ్చటగా వుందో! వాళ్ళు పెరిగి, పెద్దవాళ్ళయి, పెళ్లిచేసుకొని అన్యోన్యంగా కాపురం చేస్తూంటే చూచి ఆనందించేకంటే యేంకావాలి బావా మనకీ ప్రపంచంలో"- అనేవాడు భానుమూర్తి తండ్రి రమణయ్య.

"కాదామరి?" అన్నట్టు సన్నగా నవ్వేవాడు శశిరేఖతండ్రి రామక్రిష్ణయ్య.

రామకృష్ణయ్య బాగా అర్జిస్తూన్న రోజుల్లో బంధువు లెవర్నీ కాదన్నవాడు కాడు. శరణన్నవాణ్ణల్లా ఆదరించినవాడే. ఏదోవిధంగా సాయం చేసినవాడే.

బావమరిది రమణయ్య ఆర్థికంగా బాధబడే రోజుల్లో అతగాణ్ణి చేరదీసి తన వ్యాపారంలో వాటాయిచ్చి సొంతంగా వ్యాపారం సాగించుకోగల స్తోమత వొచ్చేవరకూ, సర్వవిధాలా సాయపడ్డాడు. ఈనాడు రమణయ్య పచ్చగావుండి, పదిమందికి పెట్టగల స్థితిలో వున్నాడంటే రామకృష్ణయ్యగారి దర్మమే ననాలి.

రామకృష్ణయ్యగారు చనిపోయేనాటికి శశిరేఖకి పదేళ్ళుంటాయేమో. రామకృష్ణయ్య జబ్బున పడ్డంతో వ్యాపారం ఆగిపోయింది. దమ్మిడీ ఆదాయం లేకపోగా, ఖర్చులు పెరగడం అనివార్యమై పోయింది. రామకృష్ణయ్యగారు పరమపదించేనాటికి ఓ పాతడాబా యిల్లూ, రెండెకరాల మాగాణీ మాత్రమే మిగిలింది.

భర్తచనిపోయి, సంసారం చితికిపోయింతరువాత, రమణయ్యగారు రాకపోకలు తగ్గించినప్పటికీ పిల్లపెద్దదయితే యెక్కడికి పోతారు లెమ్మని ధైర్యంగానే వుండేది అన్నపూర్ణమ్మ. అధైర్యంతోను తన యింట్లో ఓభాగం అద్దెకిచ్చి ఆ అద్దె డబ్బుతోనూ, పొలంలోవచ్చే గింజతోనూ ఎలాగో గ్రాసం గడుపుకుంటూ శశిరేఖని స్కూలు ఫైనల్ దాకా చదివించింది. శశిరేఖా భానుమూర్తి యిద్దరూ వొక్కయేడే స్కూలు ఫైనలు ప్యాసయ్యారు.

భానుమూర్తి కాలేజీలో చేరాడు. పై చదువులు చదవడానికి తాహతులేక శశిరేఖ ఇంట్లోనే వుండిపోయింది. అమ్మాయి కింకా పెళ్లిచెయ్యలేదేమని ఎవరేనా అడిగితే-"ఇప్పుడేం తొందర, అబ్బాయి చదువుకుంటున్నాడాయె! చదువు పూర్తి కాందే యెలా?" అనేది అన్నపూర్ణమ్మ.

భానుమూర్తి బి. ఏ. ప్యాసై ప్రస్తుతం తండ్రిగారికి వ్యాపారంలో సాయం చేస్తున్నాడు. అన్నపూర్ణమ్మ ఏనాటికానాడే రమణయ్యగారినుండి కబురొస్తుందేమోనని ఎదురుచూచేదికాని, రోజూ నిరాశ జెందక తప్పేదికాదు.

రమణయ్యగారు కబురంపకపోగా కొడుక్కి యెక్కడో సంబంధం చూస్తున్నాడన్న వార్త విన్న అన్నపూర్ణమ్మకి గుండెలు బ్రద్దలయినట్టయింది. వెంటనే రమణయ్యగారింటికెళ్ళి అతని కాళ్ళు పట్టుకుంది. రమణయ్యగారి తంతు వ్యాపార సరళి.

"నాదేముందమ్మా! ఈ రోజుల్లో పెళ్లిళ్ళు పెద్దల యిష్టప్రకారం జరుగు

తున్నా యేమిటీ? ఇంతకీ వాడికిష్టమైతే నేనేం వొద్దన్నానమ్మా? వాణ్ణే అడుగు" అని తప్పుకున్నాడు రమణయ్య.

భానుమూర్తి పేరుకి చదువుకున్న వాడేగాని, తండ్రికి యే విషయంలోనూ తీసిపోడు. లేకపోతే-నేను మేనరికం చేసుకోనని తెగేసి చెప్పడానికి సాహసించి వుండేవాడు కాదు.

పాపం, అన్నపూర్ణమ్మ మొదలు నరికిన వృక్షంలా నుంచున్నచోటే కూలబడి పోయింది. ఆమె ఆశలన్నీ అడిఆశలయినై.

శశిరేఖ కురూపిదేమీకాదు. చదువుకున్నదీ, గుణవంతురాలూను. శశిరేఖని చేసుకునేందుకు యువకుడన్న వాడెవడూ అయిష్టపడడు. కాని, చదువుకున్న వాళ్ళకి కట్నాలూ కానుకలూ లేందే ఎవడూ చేసుకోడు. పాపం అన్నపూర్ణమ్మవద్ద యేముంది? ఆడమనిషి యేం చెయ్యగలదు? ఎవరి కాళ్ళు పట్టుకోగలదు?

అన్నపూర్ణమ్మగారిస్థితి తలుచుకునేసరికి చంద్రశేఖరం గుండెలు ద్రవించి పోయినై. కాని, స్నేహితులమీదపడి బ్రతికే దౌర్భాగ్యుడు చంద్రశేఖరం అన్నపూర్ణమ్మకి చెయ్యగల సాయం ఏముంది ?

చంద్రశేఖరం ఆలోచనల్లో పడ్డాడు. ఏదో వుపాయంతోనే యీకార్యం సాధించాలని అతని ఆలోచన.

సాయంకాలం తిరిగ్గా వీధి కిటికీవద్ద కూచుని లేసు అల్లుకుంటున్న శశిరేఖ తలెత్తి చూచేసరికి చంద్రశేఖరం తన యింటివేపే రావడం కనిపించింది. చివుక్కునలేచి 'అమ్మా, చంద్రశేఖరం గారొస్తున్నారే' అని తల్లిని కేకేసి వంటింట్లోకి దారితీసింది. దొడ్లో మొక్కలికి నీళ్లు పోసున్న అన్నపూర్ణమ్మ చేతులు కడుక్కుని తుడుచుకుంటూ ఎదురయి 'రా నాయనా రా ఎన్నాళ్ళకి కనిపించావ్?' అని ఆహ్వానించింది.

చంద్రశేఖరం ఆలోచనల్లో పడుట చూచి కుర్చీచూపి అన్నపూర్ణమ్మ నేలపై చతికిలబడింది.

విన్నావా చంద్రం. భానుమూర్తి యేమన్నాడో అని కంటనీరు పెట్టుకుంది.

'విన్నానండి విన్నాను. ఇంతకీ మీకెందుకు బెంగ ? శశిరేఖకేం తక్కువని? '

'ఏమీ తక్కువకాదు కాబట్టే ఇంత బెంగ నాయనా. ఏ చవటో, కురూపో అయివుంటే యింతగా బెంగపడేదాన్ని కాదు. కట్నాలు కానుకలూ యివ్వందే మంచి సంబంధమంటూ దొరుకుతుందా చంద్రం? నా వద్దేమున్నదని? '

'నిజమే, పైసా చూపితే కొండమీద కోతయినా దిగొస్తుంది. అయితే అన్నపూర్ణమ్మగారూ నేనొకటి చెబుతాను కాదనకుండా చేస్తారా? '

'ఏఁవిటి చంద్రం?'

'ఏమీలేదు. ఇదిగో యీ ఎంట్రీ చూశారూ, రాత్రింబవళ్ళు ఆలోచించి నా మేధస్సునిపిండి పూర్తి చేశాను. కాదనకుండా దీన్ని శశిరేఖపేర పంపండి. తప్పకుండా ఫస్టుప్రైజు పాతిక వేలు గెలుస్తుంది. అప్పుడు భానుమూర్తే పరుగెత్తుకురాకపోతే నన్నడగండి! '

"నిజమే కాదన్ను. కాని యీ విషయంలో మాత్రం నాకు పూర్తి విశ్వాసముంది"

"అంత విశ్వాసముంటే నువ్వే ప్రయత్నించక పోయావా?"

"నేనా? బాగానేవుంది. ఎంట్రీకి ఓరూపాయిడబ్బులు దానంచెయ్యండ్రా అంటే ఎవడు చేస్తాడు ? అయినా నా కెందుకండి అంతడబ్బు? సంసారమా, చట్టుబండలా? వొంటరిగాణ్ణి!'

అంత విషాదంలోనూ అన్నపూర్ణమ్మ నవ్వక తప్పిందికాదు.

'అయితే నువ్వు పెళ్ళి చేసుకోవా చంద్రం?'

'ఎందుకు చేసుకోను? పిల్లనిచ్చి తన యింట్లో కూడుబెట్టి, బ్రతికినంతకాలము భార్యాభర్తల్ని మేపకలిగే అత్తారు దొరికితే?—అయినా యీ దేశదిమ్మరిగాడికెందుకండీ పెళ్ళామూ పిల్లలూను?' అన్నాడు చంద్రం.

ఇంతలో శశిరేఖ కాఫీ పట్టుకొచ్చి బల్లమీదపెట్టి వెళ్ళింది. చంద్రశేఖరం కాఫీ ముగించుకుని వెళుతూ 'ఏమండోయ్ మరచిపోకండి' రేపే పోస్టు చెయ్యాలి ఎంట్రీని. తప్పకుండా యేదో మహోపకారం జరిగి తీరుతుందని నా అంతరాత్మ చెబుతోంది. రూపాయికోసం చూడకండి. తప్పకుండా పంపాలి'— అని అన్నపూర్ణమ్మగారివద్ద మాట తీసుకుని మరీ వెళ్ళాడు.

చంద్రశేఖరం అంతగా చెబుతోంటే అన్నపూర్ణమ్మ కాదనలేక పోయింది.

'ఏమో, ఏ పుట్టలో ఏ పాముందో?- ఎవరి వాక్కులో ఏ అమృతముందో?- అదృష్టముంటే ఎందుకు ఫలించకూడదు?' అనుకుంది అన్నపూర్ణమ్మ.

వారం రోజులు గడిచింది. ఓనాడు శశిరేఖ పేరిట యెక్కణ్ణించో టెలిగ్రాం వచ్చిందని జవాను చెప్పాడు. శశిరేఖ సంతకంచేసి తీసుకుని చదువుకొంది. సంభ్రమాశ్చర్యాలతో క్షణకాలం మాట్లాడలేకపోయింది. చంద్రశేఖరం చెప్పినట్టే శశిరేఖ ఫస్టుప్రైజు పాతిక వేలు గెలిచిందిట. అన్నపూర్ణమ్మగారి ఆనందం హద్దులు దాటింది.

ఈ వార్త క్షణంలో వూరంతా ప్రాకి పోయింది.

మరుసటిరోజు ఉదయం రమణయ్య గారు ఇద్దరు పెద్దమనుష్యులతోబాటు తన యింటి గుమ్మంముందు ప్రత్యక్షం కావడంతో అన్నపూర్ణమ్మకంతా అర్థమై పోయింది.

'ఛీ! ఏం మనుషులు! డబ్బుకోసం ఏం పాకులాట?' అని అసహించుకుంది మనసులో.

'అన్నపూర్ణమ్మా! వాడసలే కుర్ర కుంక! వాడిమాటలకేమీ బాధ పెట్టు కోకు. నే నెలాగో చెప్పి వొప్పించా ననుకో! అయినా శశిరేఖ మాత్రం పరా యిదా? చిన్నతనంనుండి యిద్దరూ 'లైలామజ్ను' 'దేవదాసు'లా వొక్క చోటే ఆడుకున్నారు. వొక్కచోటే పెరిగారు. శశిరేఖంటే వాడికి మాత్రం యిష్టంలేకనా?-ఏదో కుర్రతనం అంతే, నువ్వేమీ అనుకోకు'-అంటోంటే అన్న పూర్ణమ్మకి అరికాలిమంట నెత్తికెక్కి నట్టయింది.

'నిజమేనన్నాయ్! భానుమూర్తి మాత్రం పరాయివాడా నాకు?'

దానిది పసితనం కాకపోతే ఎంత చెప్పినా వొప్పకుంటేనా? వొక్కటే మంకుపట్టు మేనరికంచేసుకోనంటోంది. 'ఇష్టంలేని పెళ్లిలా చెయ్యనన్నాయ్?' అని అన్నపూర్ణమ్మ అంటోంటే రమ ణయ్యగారి ముఖాన కత్తివాటుకి నెత్తుటి చుక్క లేకుండా పోయింది. పాపం, ముఖాన పేడేసుకుని వొచ్చిందారే వెళ్లి పోయాడు రమణయ్య.

కుక్కకాటుకి చెప్పుదెబ్బ బాగా తగి లింది లెమ్మని అన్నపూర్ణమ్మ సంతో షించింది.

మిత్రుడిపెళ్లికి మద్రాసెళ్ళిన చంద్ర శేఖరం దిగబడ్డాడు. ఊళ్ళో కాలుపెట్టి పెట్టగానే జరిగిందంతా విని చంద్ర శేఖరం విస్తుపోయాడు. తాను పన్నిన పన్నుగడ ఇలా భగ్నమైనందుకు ఎంత గానో విచారించాడు. అన్నపూర్ణమ్మ చేసిన తెలివిమాలినపనికి వొళ్లు మండు కొచ్చింది. బాగా చీవాట్లుపెట్టాలనిపిం చింది. వెంటనే లేచి అన్నపూర్ణమ్మగా రింటికి బయలుదేరాడు.

చంద్రశేఖరాన్ని చూడగానే అన్న పూర్ణమ్మ సంతోషంగా ఎదురొచ్చి ఆహ్వా నించింది. చంద్రశేఖరానికిమాత్రం వొళ్లు మండుకుపోతుంది.

రమణయ్యగారితో, మేనరికంచేసుకో దని చెప్పి తిప్పికొట్టారటగా! కుర్చీలో కూలబడుతూ తీవ్రంగా అన్నాడు.

'అవును చంద్రం! నీ ధర్మమంటూ పాతికవేలు ఫస్టుప్రైజు కొట్టిందిగా శశి రేఖ. ఆ పిసినిగొట్టు సంబంధమే కావాలా ? డబ్బుంటే సంబంధాల కేం తక్కువ చంద్రం. డబ్బుకోసం గడ్డితినే వాళ్లకంటే దారినపోయే దానయ్యే నయం కదూ?'

క్షమించండి అన్నపూర్ణమ్మ గారూ! మీరు పప్పులో కాలే శారు. నిజంగా శశిరేఖ ఫస్టు ప్రైజు పాతికవేలూ గెలిచిందనే అనుకుంటు న్నారా. అలా నాటకమాడి నమ్మిస్తేగాని రమణయ్యగారు దిగొచ్చి, శశిరేఖని తన కొడుక్కిచేసుకుంటానని నలుగురెదుటా మాట యివ్వడని నేను పన్నిన పన్నా గమే కాని, నిజంగా శశిరేఖకి ఫస్టుప్రైజు రాలేదు.'

'అవును చంద్రం! నీవు మాకోసము ఏంచేసిందీ, ఎంత కష్టపడిందీ, రెండో టెలిగ్రామ్ వొచ్చేదాకా తెలీదు. ఎలా గయితేనేం నీ వాడిన నాటకం నిజమైం దంటే, నీ నిష్కల్మష హృదయానికీ, నీ పరోపకారబుద్ధికీ నిదర్శనం యింకేం కావాలి? కంపెనీ రెప్రెజెంటేటివ్ రేపే యీవూరొస్తున్నాట్ట చెక్కును అందించ డానికి, ఇప్పుడేరిజిస్టర్డుఉత్తరమొచ్చింది అని అంటూ లోనికివెళ్లి పెట్టెలోంచి కవరు పట్టుకొచ్చి చంద్రశేఖరాని కంది స్తోంటే, చంద్రశేఖరం ఆశ్చర్యంతో గుడ్లెల్లబెట్టాడు.

'తా నొకటితలిస్తే దైవమొకటి తలచిం దన్నట్టు-నే ననుకున్న దేమిటి-జరిగిం దేమిటి?'—అని ప్రశ్నించుకున్నాడు.

'శశిరేఖ చాలాఅదృష్టవంతురాలండీ' చంద్రశేఖరం తన సంతోషాన్ని వెలి బుచ్చాడు.

'అయితే, ఎక్కడే నా చూచారా సంబంధం?'

'చూచాను చంద్రం! నీ సమ్మతి తెల్సుననుకుంటున్నాను'

'నాసమ్మతా? ఎందుకూ?'

'అదేమిటి చంద్రం? పాతిక వేలూ నీ ధర్మంకాదూ? ఇప్పుడు నీ సమ్మతి లేకుండా శశికి పెళ్లెలా జరుగుతుంది?'

'బాగానే వుందండి; ఎవరి అదృష్టం వాళ్ళది. మధ్య నా ధర్మమేమిటి? ఊరి మీదపడి బ్రతికే దౌర్భాగ్యుణ్ణి నేను!'

'నిజమే చంద్రం. ఊరిమీదపడి బ్రతికే దౌర్భాగ్యుడిడబ్బు మాకెందుకు? నీ పాతికవేలూ నువ్వే తీసుకో మాకొద్దు'

'మాటలకేం లెండి.'

'మాటలుకాదుచంద్రం నిజం. కాని ఉచితంగా కాదు సుమా! శశిరేఖని చేసు కుంటేనే కట్నంక్రింద'

'వేళాకోళ మాడుతున్నారు.'

'కాదు చంద్రం. నిజం చెబ్తున్నాను. ఏం? నీకిష్టంలేదా?'

చంద్రశేఖరానికి తను ఏమంటున్నదీ అర్థంకాలేదు.

'నా యిష్టానికేమిటిలెండి! శశిరేఖ యిష్టంకూడా కావాలిగా?'

'శశిరేఖ కిష్టం లేకపోవడ మేవిఁటి చంద్రం? ఇదంతా అదిచ్చిన సలహాయే సుమా!'

'ఏవిఁటి అలాగా?' — చంద్రశేఖరం ఆశ్చర్యంతో నోరుతెరిచి శశిదగ్గరకెళ్లాడు.

★